క్లుప్తంగా

నేడు వేణుగోపాలస్వామి కల్యాణం

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో గల ఆళ్వారాజుల రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు తెలగ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి రథోత్సవం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎండ్లూరులో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరానికి హాజరైన డాక్టర్లు

చీమకుర్తి: మాజీ ఎమ్మెల్యే ఆరేటి కోటయ్య వర్ధంతి సందర్భంగా సంతనూతలపాడు మండలంలోని ఎండ్లూరులో పేదలకు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆరేటి కోటయ్య కుమారుడు సుందర రాజారావు ఆధ్వర్యంలో సర్వనేత్రాలయ ఆస్పత్రికి చెందిన డాక్టర్ల సహకారంతో పేదలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అందించారు.

సంక్షేమ పథకాలపై బీజేపీకి అభ్యంతరం లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలుకు కావాల్సిన ఆదాయాన్ని సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శివారెడ్డి అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శులు రాయపాటి అజయ్, శివాజీ యాదవ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్ అందజేత



స్పోర్ట్స్ కిట్ అందిస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: ప్రకాశం జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ టీమ్‌కు ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి శనివారం చీమకుర్తిలో స్పోర్ట్స్ కిట్ అందించారు. నెల్లూరు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫున పాల్గొంటున్న జట్టుకు కిట్ అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధించాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: దేశ ప్రజల మధ్య సమతను సాధించడం మహనీయుడు అంబేడ్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే సాధ్యమవుతుందని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు అన్నారు. శనివారం జైజనం పార్టీ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 10వ తేదీ నుంచి జైజనం పార్టీ ఒంగోలులోని కబాడిపాలెం నుంచి శ్రీకాకుళం వరకు రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య యాత్ర చేపడుతుందని ఆ పార్టీ వ్యవస్థాపకుడు చప్పిడి రవి బాబు తెలిపారు.

జగనన్న పథకాలతోనే ఆర్థిక ఎదుగుదల

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి నిరంతర సంక్షేమం
- వచ్చే ఎన్నికల్లోనూ జగనన్నను ఆశీర్వదించి అండగా నిలుద్దాం
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎస్‌ఎన్ పాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి



సైడు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేదల కుటుంబాలు ఆర్థికంగా ఎదిగాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో మండలంలోని పాటిమీదపాలెంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి బూచేపల్లి వెంకాయమ్మతో పాటు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. పార్టీలకతీతంగా సీఎం అందిస్తున్న సంక్షేమ పథకాల వలనే మహిళలు తమ జీవనోపాధిని మెరుగుపరచుకోగలిగారన్నారు. సీఎం అధికారం చేపట్టినప్పటి నుంచి ఎలాంటి విరామం లేకుండా నిరంతరం నాలుగేళ్లుగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో కూడా ఎలాంటి విఘాతం లేకుండా పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మళ్లీ సీఎంను చేసేందుకు అండగా నిలవాలని ప్రజలు, లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కూడా కలిసికట్టుగా పార్టీని బలోపేతం చేసి మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు నడుం బిగించాలన్నారు. పాటిమీదపాలెంలో రూ.18 లక్షలతో నిర్మించనున్న సైడు కాలువలకు ఈ సందర్భంగా శంకుస్థాపన చేశారు. తొలుత గ్రామంలోకి ప్రవేశించగా స్థానిక నాయకులు బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డికి డప్పు వాయిద్యాలతో పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలతో శాలువాలు కప్పి వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, పార్టీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖర రెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, స్థానిక కౌన్సిలర్ తప్పెట బాబూరావు, సర్పంచ్ బొంతా కరుణప్రియ సంతోష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు కూడలి అంజలి మాలకొండయ్య, కూరాకుల రాఘవ రెడ్డి, కృష్టిపాటి శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందిస్తూ...

క్యాటియాపై ముగిసిన వర్క్‌షాప్

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో మెకానికల్ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో క్యాటియాపై ఆరు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కో ఆర్డినేటర్ ఎ.రామకృష్ణారెడ్డి, ట్రైనర్లు కె.ప్రసన్నలక్ష్మి, డి.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్యాటియా సాఫ్ట్‌వేర్‌లో బేసిక్స్, వివిధ డొమైన్ల అప్లికేషన్లు, స్టెప్స్ ఆఫ్ డిజైన్ ప్రోడక్ట్స్, ఇచ్చిన నమూనాల ప్రకారం మోడల్స్ సృష్టించడం, విశ్లేషించడం, 3డీ మోడలింగ్ ప్రాముఖ్యత, 3డీ మెటీరియల్స్ ధర్మాలను అనుసంధానించడం, అసెంబ్లింగ్, చివరకు పూర్తి 3డీ మోడల్స్‌ను సృష్టించడం, దాని వివిధ రూపాలను విశ్లేషించడం అనే అంశాల గురించి వివరణాత్మకంగా తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులతో డ్రాఫ్టింగ్ చేయించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పేస్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఈ సాఫ్ట్‌వేర్ నేర్చుకోవడం ద్వారా డిజైనింగ్‌లో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ జి.కొండయ్య, ఆటోమొబైల్ విభాగం అధిపతి వి.శివప్రసాద్, క్యాడ్‌ల్యాబ్ ఇన్‌చార్జి ఎన్.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హనుమత్ జయంతి కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: నగరంలోని కేశవస్వామిపేటలో ప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో ఈ నెల 12 నుంచి నిర్వహించనున్న హనుమత్ జయంతి కరపత్రాలను మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శనివారం ఆవిష్కరించారు. 14వ తేదీ వరకు రెండు రోజుల పాటు హనుమజ్జయంతి ఉత్సవాలు, కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించడం శుభ పరిణామం అని ఆయన అన్నారు. లోక కల్యాణం కోసం ధర్మ కార్యక్రమాలను నిర్విరామంగా చేపట్టాలని ఆలయ కమిటీకి సూచించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి వెంకట సూర్యనారాయణ, ఈవో డి.రజనీకుమారి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, కరేటి కిరణ్‌బాబు, సూపర్‌బజార్ డైరెక్టర్ వి.మురళి పాల్గొన్నారు.

ఇంటర్ బాలికలకు స్నాక్స్ ఏర్పాటు



స్నాక్స్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

- బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రారంభించిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పూర్తయ్యేంత వరకు పరీక్షలు రాస్తున్న బాలికలకు బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో స్నాక్స్ అందిస్తామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుతో కలిసి చీమకుర్తిలోని గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ ఫెయిలైన బాలికలకు నిర్వహిస్తున్న తరగతులను శనివారం ఆమె పరిశీలించారు. జిల్లాలోని పలు కాలేజీల బాలికలకు నిర్వహిస్తున్న ఇంటర్ సప్లిమెంటరీ క్యాంప్ ఈ నెల 21వ తేదీ వరకు జరుగుతుందని, అప్పటి వరకు బాలికలకు పౌష్టికాహారంతో కూడిన స్నాక్స్ అందిస్తామని బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. బూచేపల్లి వెంకాయమ్మకు సప్లిమెంటరీ క్యాంప్ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, పాలడుగు సుబ్బారావు, స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పదిలో విద్యార్థుల విజయం



అల్లూరులో ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని మహిమూన్‌ను అభినందిస్తున్న ఎంఈవో అజయ్‌బాబు

- సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- ప్రైవేటు పాఠశాలల్లోనూ మెరుగైన ఫలితాలు

ఒంగోలు: పదో తరగతి ఫలితాల్లో ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లోని పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పలువురు మంచి మార్కులు సాధించగా, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా మెరుగైన ఫలితాలు సాధించారు. ఒంగోలులోని డ్రీమ్స్ ఒలంపియాడ్ విద్యార్థులు విజయం సాధించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ యూవీఎస్ లక్ష్మీదేవి తెలిపారు. 56 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

మాంటిస్సోరి విద్యార్థులు...

తమ పాఠశాల విద్యార్థులు పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని మాంటిస్సోరి విద్యాసంస్థల చైర్మన్ పి.ప్రకాష్ బాబు తెలిపారు. మొత్తం 150 మంది పరీక్షకు హాజరయ్యారని, 11 మంది అత్యధిక మార్కులు సాధించారని తెలిపారు. పరీక్షకు హాజరైన ప్రతి ఇద్దరిలో ఒకరికి మంచి మార్కులు వచ్చాయని కరస్పాండెంట్ శబరినాథ్ తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

కేరళ స్కూల్ విద్యార్థులు...

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగించారని కేరళ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ సిబి మైఖేల్ తెలిపారు. 10 మంది అత్యధిక మార్కులు, 15 మంది అధిక మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

సాయి పబ్లిక్ స్కూలు...

తమ పాఠశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని సాయి పబ్లిక్ స్కూలు పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జునరావు తెలిపారు. ఐదుగురు భారీగా, 15 మంది అధికంగా, 36 మంది మెరుగ్గా ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. 98 శాతం ఉత్తీర్ణత సాధించారని విద్యార్థులను అభినందించారు.

శ్రీ చైతన్య విద్యార్థులు...

తమ విద్యా సంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని శ్రీచైతన్య విద్యాసంస్థల ఒంగోలు జోన్ ఆర్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఒంగోలు జోన్ నుంచి 22 మంది విద్యార్థులు సంచలన ఫలితాలు, 104 మంది అత్యధిక మార్కులు సాధించారన్నారు. వివిధ సబ్జెక్టులలో వందకు వంద మార్కులను 222 మంది విద్యార్థులు సాధించారన్నారు. నాలుగు బ్రాంచీలు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. ఒంగోలు భాగ్యనగర్ బ్రాంచ్‌లో ప్రిన్సిపాల్ హర్షవర్ధన్‌తో కలిసి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

గౌతమ్ మోడల్ స్కూల్...

తమ పాఠశాల విద్యార్థులు సంచలనం సృష్టించారని గౌతమ్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.కొండయ్య తెలిపారు. 8 మంది అత్యధిక మార్కులు, 20 మంది మెరుగైన ఫలితాలు, 49 మంది ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. మొత్తంగా 62 మంది డిస్టింక్షన్ సాధించారన్నారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

నిర్మల స్కూలు...

తమ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో విజయభేరి మోగించారని నిర్మల ఉన్నత పాఠశాల డైరెక్టర్ నల్లూరి సురేంద్ర తెలిపారు. 8 మంది భారీ స్కోర్ చేయగా, 17 మంది అధికంగా, 36 మంది మెరుగ్గా, 43 మంది ఉత్తమంగా, 73 మంది మంచి మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాళ్లు డి.శ్రీనివాసులు, ఎస్.విక్టర్‌పాల్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

భాష్యం విద్యార్థులు...

ఒంగోలు శివాజీనగర్ భాష్యం క్యాంపస్‌లో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అభినందించారు. గుంటూరుకు ఆహ్వానించి మరీ ప్రత్యేకంగా అభినందించారు. ఒంగోలు భాష్యం క్యాంపస్‌లో అనేకమంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు తెలిపారు.

గౌతమి ఇ టెక్నో స్కూలు...

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు జయభేరి మోగించారని స్థానిక గోపాలనగరం గౌతమి ఇ టెక్నో స్కూలు కరస్పాండెంట్ పి.కిషోర్‌కుమార్ తెలిపారు. ప్రతి ఇద్దరిలో ఒకరు మంచి మార్కులు సాధించారని పేర్కొంటూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

రవీంద్రభారతి విద్యార్థులు...

తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపాల్ టి.లక్ష్మీరాజ్, కరస్పాండెంట్ టి.సాత్విక్‌రాజ్ తెలిపారు. 67 మంది పరీక్షలకు హాజరయ్యారని, వారిలో 20మందికిపైగా మంచి మార్కులు సాధించారని తెలిపారు. మరో 34 మంది కూడా మెరుగైన ఫలితాలు సాధించారని అభినందించారు.

శివాని విద్యార్థులు...

తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని శివాని హైస్కూలు కరస్పాండెంట్ ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. 33 మంది పరీక్షకు హాజరయ్యారని, వారిలో 10 మంది విద్యార్థులు భారీగా మార్కులు సాధించారని పేర్కొన్నారు. గణితం, సైన్స్‌లో వందకు వంద మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

కొత్తపట్నం మండలంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సత్తా...

కొత్తపట్నం: మండలంలో అల్లూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని షేక్ మహిమూన్ పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి అభినందనలు అందుకుంది. ఆమె నివాసంలో తల్లిదండ్రులు, ఎంఈవో అజయ్‌బాబు, హెచ్‌ఎం బి.మధిలి, రికార్డు అసిస్టెంట్ బోలా అంజయ్య అభినందించారు. కేక్ కట్ చేసి తినిపించారు. ప్రైవేటు పాఠశాలలకు పోటీగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థి అత్యధిక మార్కులు సాధించడం గొప్ప విషయమని ఎంఈవో కొనియాడారు. మండలంలోని కొత్తపట్నం, అల్లూరు, ఈతముక్కల, గమళ్లపాలెం, ఆలూరు, మోటుమాల హైస్కూళ్ల నుంచి 562 మంది పరీక్షలకు హాజరవగా, 471 మంది ఉత్తీర్ణులయ్యారు.

మద్దిపాడులో...

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. మద్దిపాడులోని నారాయణ హైస్కూల్ విద్యార్థులు సైతం మంచి మార్కులు సాధించారు. గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి అభినందనలు అందుకున్నారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 525 మంది పదో తరగతి పరీక్షలు రాయగా, 405 మంది ఉత్తీర్ణత సాధించారు. అమ్మనబ్రోలు బాలికల ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో నూటికి నూరు శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ శైలజ ప్రియదర్శిని తెలిపారు. మండలం వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులను అమ్మనబ్రోలు రెసిడెన్షియల్ విద్యార్థిని పి.శ్రీలత సాధించగా, ద్వితీయ స్థానంలో నాగులుప్పలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి డి.సాయిబాబ సాధించాడు. తృతీయ స్థానంలో జెడ్పీ ఉన్నత పాఠశాల అమ్మనబ్రోలుకు చెందిన ఐ.వి.తేజ నిలిచినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 225 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 217 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉప్పుగుండూరు ఆక్స్‌ఫర్డ్, సరస్వతి పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులు సాధించారు.

చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లో...

చీమకుర్తి: సంతనూతలపాడు గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు 74 మందికిగానూ అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వీ మెర్సీ తెలిపారు. చీమకుర్తి మండలంలోని బండ్లమూడి జిల్లాపరిషత్ హైస్కూలు విద్యార్థులు మంచి మార్కులు సాధించగా, హెచ్‌ఎం టీఎల్ కాంతారావు తెలిపారు. చీమకుర్తిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి అభినందనలు అందుకున్నారు. ఎస్‌కేఆర్ మానసిక వికాస కేంద్రంలో ఆరుగురు విద్యార్థులకుగానూ అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ అంజిరెడ్డి తెలిపారు. శ్రీవిజ్ఞాన్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించినట్లు కరస్పాండెంట్ మంచా వెంకటేశ్వర్లు తెలిపారు.

మల్లవరం వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ఉభయదాతలకు ఆశీర్వచనాలు అందిస్తున్న ఆలయ అర్చకులు

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గుండ్లాపల్లికి చెందిన కల్యాణ ఉభయదాతలు పల్లకి సుబ్బరామిరెడ్డి, ఆయన కుమారుడు పల్లకి పేరారెడ్డి దంపతులు శనివారం గజోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణానికి ముందురోజు నిర్వహించే గజోత్సవం సందర్భంగా ఆలయ అర్చకుడు నారాయణం వెంకటాచార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆదివారం స్వామివారి కల్యాణాన్ని ఆగమ పండితులు దివి వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నారా నాగిరెడ్డి, ఈవో దామా నాగేశ్వరరావు తెలిపారు.

కేజీబీవీలో ఇంటర్ విద్యార్థుల తరగతుల తనిఖీ



తరగతులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో, ఎంఈవో

కొత్తపట్నం: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులకు మండలంలోని మోటుమాల కేజీబీవీలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా ఎంపీడీవో పి.సుజాత, ఎంఈవో ఏ అజయ్‌బాబు శనివారం తనిఖీ చేశారు. క్లాసులు ఎలా జరుగుతున్నాయి, ఎంత మంది వచ్చారని పరిశీలించారు. కొత్తపట్నం, తాళ్లూరు, జరుగుమల్లి, పొన్నలూరు, ముండ్లమూరు మండలాల నుంచి 125 మంది విద్యార్థులకు కోచింగ్‌కు హాజరయ్యారని చెప్పారు. కోచింగ్ తీసుకుని రాబోయే సప్లిమెంట్రీ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో అరుణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సాంకేతిక విద్య

ఈతముక్కల (కొత్తపట్నం): అంగన్‌వాడీ కేంద్రాల్లో సాంకేతిక విద్య అందిస్తున్నట్లు సీడీపీవో రజనీకుమారి తెలిపారు. ఈతముక్కల అంగన్‌వాడీ కేంద్రం-85లో శనివారం పాఠశాల సంసిద్ధత కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ ప్రీస్కూల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అర్హత కలిగిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. తల్లిదండ్రులు పూర్తి బాధ్యత తీసుకుని ప్రతిరోజూ కేంద్రాలకు అలవాటుచేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్బంధ విద్య కాకుండా ఆటపాటలతో కూడిన విద్య అభ్యసించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడికొండ సునీత, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త కల్పన, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ ప్రీస్కూల్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ సునీత